# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశం ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలను సహించబోదనే సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి ఇచ్చిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- గడచిన 12 సంవత్సరాలలో రైల్వే రంగంలో గణనీయమైన పరివర్తన చోటు చేసుకుందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- సాయుధ దళాలకు అధిక పోషక విలువలు కలిగిన ఉత్పత్తులను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలియజేశారు.
- దేశంలో ఎరువులు, ఎల్‌పీజీ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలను సహించబోదనే సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి ఇచ్చిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ భద్రతా సదస్సు 2.0లో ఆయన మాట్లాడుతూ... మన గడ్డపై ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు కేవలం దౌత్యపరమైన ప్రకటనలు చేస్తూ ఉండే విధానం ఇక ముందు ఉండదని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి, దానిని ప్రోత్సహించే వారికి మధ్య ఎలాంటి భేదం చూపకూడదనేది ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. పాకిస్తాన్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద కేంద్రంగా, భారతదేశాన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రంగా ఆయన అభివర్ణించారు. మారుతున్న ఈ ప్రపంచ క్రమంలో మరింత అప్రమత్తతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ రక్షణ ఎగుమతులు గత సంవత్సరం కంటే 62 శాతం వృద్ధి చెంది, రికార్డు స్థాయిలో 38 వేల 424 కోట్ల రూపాయలకు చేరుకున్నాయని కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన 12 సంవత్సరాలలో రైల్వే రంగంలో గణనీయమైన పరివర్తన చోటు చేసుకుందని ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. జమ్మూ తావి రైల్వే స్టేషన్ నుండి ఈరోజు ఆయన శ్రీనగర్-జమ్మూ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటివరకు శ్రీనగర్ నుండి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా వరకు నడిచే ఈ రైలు.. ఇకపై జమ్మూ తావి వరకు నడుస్తుంది. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ... ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ, కాశ్మీర్ ప్రాంతం నిరంతర అభివృద్ధిని చూసిందన్నారు. పెరుగుతున్న ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ రైలులోని కోచ్‌ల సంఖ్యను 8 నుండి 20కి పెంచినట్టు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సాయుధ దళాలకు అధిక పోషక విలువలు కలిగిన ఉత్పత్తులను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. భారత సైనిక అధికారులతో న్యూఢిల్లీలో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. సాయుధ దళాల కోసం సేకరణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయని మంత్రి సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. దశలవారీగా సేంద్రీయ రేషన్ వస్తువులను ప్రవేశపెట్టడం, బియ్యం, గోధుమ పిండి వంటి భారత్ బ్రాండ్ ఉత్పత్తులను విస్తరించడం వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే అత్యుత్తమ నాణ్యతను నిర్ధారించడం, బాస్మతి బియ్యం సేకరణను పెంచడం వంటివి కూడా ఉన్నాయి. సమర్థవంతమైన సప్లై చైన్ ను నిర్ధారించడానికి సహకార సంఘాల ద్వారా సేకరణను పెంచడంపై చర్చలు జరిగాయని ప్రహ్లాద్ జోషి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ ఎరువుల ఉత్పత్తి 62.37 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని కేంద్ర ఎరువుల శాఖ అదనపు కార్యదర్శి అపర్ణా శర్మ తెలియజేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... దేశంలో ఎరువుల లభ్యతకు కొరత లేదని, 2026 ఖరీఫ్ సీజన్ అవసరాలకు మించి సరఫరాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. దిగుమతులు సుమారు 15.39 లక్షల మెట్రిక్ టన్నులు ఉండడంతో ప్రస్తుతం మొత్తం లభ్యత దాదాపు 78 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందన్నారు. దేశంలో ఎరువుల భద్రత బలంగా, స్థిరంగా నిర్వహించబడుతోందని ఆమె ఉద్ఘాటించారు. అనంతరం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఎల్‌పిజి, పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరాయంగా ఉందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ఇటలీ రక్షణ మంత్రి గైడో క్రోసెట్టోతో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పశ్చిమాసియాలోని ప్రస్తుత పరిస్థితితో సహా పలు ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చించారు. భారతదేశ ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం, ఇటలీ రక్షణ సహకార చొరవ కింద పరస్పర ప్రయోజనకరమైన రక్షణ పారిశ్రామిక సహకారాన్ని మరింత అభివృద్ధి చేసే మార్గాల గురించి కూడా చర్చించినట్లు కేంద్రమంత్రి సామాజిక మాధ్యమం పోస్ట్‌లో తెలిపారు. ఇరు దేశాల సాయుధ దళాల మధ్య సైనిక కార్యకలాపాలకు సంబంధించి 2026-27 ద్వైపాక్షిక సైనిక సహకార ప్రణాళికపై కూడా పరస్పరం సంతకాలు చేసుకున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వియత్నాం అధ్యక్షుడు టో లామ్ వచ్చే నెల 5వ తేదీ నుండి రెండు రోజుల పాటు భారత్‌లో అధికారికంగా పర్యటించనున్నారు. ఆయనతో పాటు వియత్నాం ప్రభుత్వ మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం, ఒక వ్యాపార ప్రతినిధి బృందం కూడా పర్యటనలో పాల్గొననుంది. వియత్నాం అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత టో లామ్ భారతదేశంలో చేస్తున్న తొలి అధికారిక పర్యటన ఇదేనని విదేశాంగ మంత్రిత్వ శాఖ

ఒక ప్రకటనలో తెలిపింది. పర్యటనలో భాగంగా టో లామ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక సంబంధాలలోని వివిధ అంశాలపైనా, అలాగే పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపైనా విస్తృత చర్చలు జరపనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కొండ ప్రాంతాలలో సురక్షితమైన, నిరాటంకమైన, సుస్థిరమైన రహదారులను నిర్మించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఉద్ఘాటించారు. “లాండ్‌స్లైడ్ మిటిగేషన్ మెజర్స్ ఫర్ రెజిలియంట్ హిల్ రోడ్స్” అనే అంశంపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ... సున్నితమైన హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పులను తట్టుకునే రహదారి మౌలిక సదుపాయాలు ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఉత్తమ పద్ధతులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. దీర్ఘకాలిక భద్రత, మన్నిక కోసం కొండ ప్రాంతాలలో రహదారి నిర్మాణం ప్రారంభించే ముందు వాలు స్థిరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సోమనాథ్ ఆలయం.. భారతదేశ ఆత్మగౌరవానికి, దృఢత్వానికి, అకుంఠిత స్ఫూర్తికి ప్రతీక అని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన “సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ యాత్ర”ను ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ.. భారతదేశం గతం నుండి, దాని పూర్వీకుల నుండి దేశ పౌరులు ప్రేరణ పొందేలా ఈ చర్య ప్రోత్సహిస్తుందన్నారు. సోమనాథ్ ఆలయం పట్ల వెయ్యి సంవత్సరాల అచంచలమైన భక్తి విశ్వాసాలకు ప్రతీకగా సుమారు 1,300 మంది భక్తులతో కూడిన ఒక ప్రత్యేక రైలు గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయానికి యాత్రను ప్రారంభించింది. న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వే స్టేషన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఢిల్లీ సాంస్కృతిక శాఖ మంత్రి కపిల్ మిశ్రాలు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ ముస్లింలకు హజ్ యాత్రను అందుబాటులో, సరసమైన ధరకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. హజ్ యాత్ర విమాన ఛార్జీల పెరుగుదలపై పలు మీడియా వేదికలపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో... మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా పోస్ట్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరల కారణంగా విమానయాన సంస్థలు 300 నుండి 400 డాలర్ల వరకు డిమాండ్ చేశాయని, అయితే మంత్రిత్వ శాఖ ఒక్కో యాత్రికుడికి 100 డాలర్లకు పరిమితం చేసిందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన గుజరాత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =